క్లుప్తంగా

నేడు వారపు సంత

అనంతగిరి: మండల కేంద్రంలోని సోమవారం వారపు సంత జరుగుతుంది.వారపు సంతకు అల్లం, బంతిపువ్వులు, తేనె తదితర అటవీ ఉత్పత్తులతో పాటు కూరగాయలను అధిక సంఖ్యలోని గిరిజనులు విక్రయానికి తీసుకొస్తారు. మైదాన ప్రాంతాలు వ్యాపారులు కూరగాయాలను విక్రయిస్తారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల పర్యటన రేపు

కూనవరం: మండలంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్‌లు మంగళవారం ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ నాయకుడు తోట రాజేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఉదయం 11 గంటలకు పోచవరం సచివాలయంలోని కాచవరం పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3.00 గంటలకు పోచవరం సచివాలయం వద్ద డ్వాక్రా మహిళలకు చెక్కులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. అనంతరం 3.30 గంటలకు ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మండల స్థాయి అధికారులు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు హాజరు కావలసిందిగా కోరారు.

ఘనంగా బాలికా దినోత్సవం



పోస్టర్లను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

అరకులోయటౌన్: మండలంలోని యండపల్లివలస గురుకులం బాలికల జూనియర్ కళాశాలలో ఆదివారం సమత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతకు బహుమతులు అందజేశారు. చైల్డ్ రైట్స్ పోస్టర్లు ప్రదర్శించారు. సమత స్వచ్ఛంద సంస్థ కో–ఆర్డినేటర్ సతీష్ కుమార్ జాతీయ బాలికా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మీ, పీడీ రమణమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే పాల్గుణతో వాయుపుత్ర మోటార్ యూనియన్ ప్రతినిధులు

అరకులోయటౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలోని వాయుపుత్ర మోటార్ యూనియన్ నూతన కార్యవర్గం ప్రదినిధులు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణను ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. యూనియన్ ప్రతినిధులు రాజయ్య, సాంబయ్య, సహదేవ్, పెదసాంబ తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు. యూనియన్ సహాయ సహకారాల తనను సంప్రదించాలని, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పాల్గుణ భరోసా ఇచ్చారు.

ముమ్మరంగా డ్రైనేజీ పనులు



సూదిమెట్టలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం

హుకుంపేట: గ్రామాల్లో ముమ్మరంగా అభివృద్ధి పనులు జరుగుతున్నట్టు జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని పాతకోట పంచాయతీ సూదిమెట్ట గ్రామంలో జిల్లా పరిషత్ నిధులు రూ.3లక్షల వ్యయంతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గిరిజన గ్రామలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులతో పాటు జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు, మంచినీరు పథకాలతో పాటు పలు అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపడుతున్నామన్నారు. నాయకులు చిన్నయ్య, బాలన్న, బొంజుబాబు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ నిలయాలకు కొత్తరూపు



మన్యంలో సరస్వతీ నిలయాలకు మహర్దశ వచ్చింది. విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిచ్చిన ప్రభుత్వం నాడు–నేడు పథకంలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంతో రూపురేఖలే మారిపోయాయి. కార్పొరేట్‌ను తలదన్నేలా మౌలిక వసతులు సమకూరాయి. డిజిటల్ బోధన అందుబాటులోకి రావడంతో పాఠశాలల్లో మంచి వాతావరణం నెలకొంది.

పాఠశాల భవనాలకు మహర్దశ


నాడు–నేడులో సమకూరిన వసతులు

సర్కారు బడుల్లో చేరేందుకు విద్యార్థుల్లో పెరుగుతున్న ఆసక్తి

అందుబాటులో డిజిటల్ బోధన



రంపచోడవరం ఎంపీపీ పాఠశాలలో డిజిటల్ బోధన



ఇర్లపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల

నాడు–నేడు మొదటి దశ పాఠశాలలు	:	27
కేటాయించిన నిధులు	:	రూ.11.5 కోట్లు
రెండో దశలో పాఠశాలలు	:	39
కేటాయించిన నిధులు	:	రూ.8.95 కోట్లు



రంపచోడవరం ఎంపీపీ పాఠశాల

రంపచోడవరం: ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌ను తలపిస్తున్నాయి. మండలంలో 96 పాఠశాలు ఉండగా వీటిలో నాడు–నేడు మొదటి దశలో 27 పాఠశాలలను రూ.11.5 కోట్లతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. రెండో దశలో రూ.8.95 కోట్లతో 39 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. వీటిలో కొన్ని పూర్తికాగా మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి.

☛ గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో కూడా మెరుగైన వసతులు కల్పించారు. విద్యార్థులకు మంచినీటి కోసం ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. డిజిటల్ తరగతి గదులను వినియోగంలోకి తీసుకువచ్చారు.

☛ రంపచోడవరం ఎంపీపీ పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దారు. సుమారు రూ.24 లక్షల మేర నిధులు వెచ్చించారు. మైదానం గతంలో చెత్తతో నిండి ఉండేది. ఇప్పుడు ప్రహరీ నిర్మించి విద్యార్థులు ఆడుకునేందుకు వీలుగా తీర్చిదిద్దారు. క్రీడా సామగ్రిని అందుబాటులోకి తెచ్చారు. 211 మంది ఉన్న ఈ విద్యాలయంలో మరుగుదొడ్లు లేక విద్యార్థినులు ఇబ్బందులు పడేవారు. సుమారు నాలుగు మరుగుదొడ్లతోపాటు రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించారు. ఒకటి నుంచి ఏడు తరగతుల వరకు డిజిటల్ విద్యాబోధన కూడా జరుగుతోంది.

☛ ఎర్లపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో అదనపు భవనాలను నిర్మించి విద్యార్థుల వసతి సమస్యను పరిష్కరించారు.

☛ ముసురుమిల్లి గిరిజన బాలుర సంక్షేమ పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటుచేశారు. అదనపు భవనాలను నిర్మించారు.

☛ పి.బొరుగుబంద గిరిజన ప్రాథమిక పాఠశాలలో ప్రహరీ నిర్మాణం, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం కల్పించారు.

☛ మండలంలోని ఎనిమిది పాఠశాలలకు రూ.1.20 కోట్లతో ప్రహరీలు నిర్మించారు.

☛ నాడు–నేడు మొదటి దశలో 27 పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు సుమారు రూ.48 లక్షలతో ఏర్పాటు చేసి సురక్షిత నీటిని అందుబాటులోకి తెచ్చారు.

☛ మండలంలోని పాఠశాలకు నాలుగు చొప్పున విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 20 చోట్ల మరుగుదొడ్లను నిర్మించారు.

☛ పాఠశాల భవనాలను ఆకర్షణీయంగా తీరిదిద్దారు. వీటికి పెయింటింగ్ నిమిత్తం రూ.1.50 కోట్లు వెచ్చించారు.

మండలం	:	రంపచోడవరం
పాఠశాలల సంఖ్య	:	96
ఉన్నత పాఠశాలలు	:	16
ఎంపీయూపీ	:	1
మండల పరిషత్	:	46
ప్రభుత్వ పాఠశాలలు	:	2
ఎయిడెట్ పాఠశాలలు	:	3
గురుకుల పాఠశాలలు	:	2
విద్యార్థుల సంఖ్య	:	8,457



రంపలోని గిరిజన ప్రాథమిక పాఠశాల

ఎంతో బాగుంది



మా పాఠశాల గతంలో ఎంతో అధ్వానంగా ఉండేది. ఎటువంటి వసతులు ఉండేవి కావు. ముఖ్యంగా విద్యార్థినులు ఎన్నో ఇబ్బందులు పడేవారు. నాడు–నేడులో ఎంతో బాగా అభివృద్ధి చేశారు. మరుగుదొడ్లు, వాష్ రూమ్‌లు, గ్రీన్ బోర్డులు ఏర్పాటుచేశారు.బెంచీల సౌకర్యం కల్పించారు. డిజిటల్ బోధన జరుగుతోంది.

– కె పూజిత. ఐదో తరగతి, ఎంపీపీ పాఠశాల రంపచోడవరం

పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు



గతంలో టీచర్ల కొరత ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పూర్తిస్థాయిలో ఉన్నారు. బోధన పూర్తిస్థాయిలో జరుగుతోంది. తమకు అవసరమైన వసతులన్నింటిని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.జగనన్న మంచి యూనిఫారాలు ఇచ్చారు. స్కూల్‌లో ఇచ్చిన షూస్ బాగున్నాయి. మధ్యాహ్నం భోజనం రుచికరంగా ఉంది.

– అయోధ్య హర్ష, ఐదో తరగతి, ఎంపీపీ స్కూల్, రంపచోడవరం



ఇర్లపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల



ఇర్లపల్లి పాఠశాలలో ఆర్వో ప్లాంట్



ఆకట్టుకుంటున్న రంపచోడవరం ఎంపీపీ పాఠశాల

డిజిటల్ బోధనతో ఆసక్తి



డిజిటల్ విధానంలో బోధన జరుగుతోంది. దీనివల్ల ఆసక్తి పెరిగింది. మా పాఠశాలలో ప్రతి తరగతికి ఒక డిజిటల్ క్లాస్ రూమ్ ఉంది. బెంచీలు ఉన్నందున నేలపై కూర్చొనే ఇబ్బందులు తప్పాయి. ఆర్వో ప్లాంట్ వల్ల సురక్షిత తాగునీరు అందుబాటులోకి వచ్చింది. వసతులు గతంలో కంటే ఎంతో బాగున్నాయి. ఎంతో మార్పు కనిపిస్తోంది.

– సాయి, పదో తరగతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రంపచోడవరం

సకాలంలో పుస్తకాలు



పాఠశాలలో వసతులు మాదిరిగానే ప్రభుత్వం సకాలంలో పాఠ్యపుస్తకాలు సరఫరా చేసింది. దీనివల్ల ప్రణాళిక పరంగా బోధనకు అవకాశం ఏర్పడింది. సకాలంలో పాఠ్యాంశాల బోధన జరుగుతోంది. డిజిటల్ బోధన ఎంతో ఉపయోగకరంగా ఉంది. పుస్తకాలు రెండు భాషల్లో ఇవ్వడంతో విద్యార్థులకు పరిజ్ఞానం మరింత పెరిగేందుకు దోహద పడుతుంది.

– సుబ్బలక్ష్మి, ఎంపీపీ స్కూల్, రంపచోడవరం

చదువుకు మంచి వాతావరణం



పాఠశాలల్లో విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా ప్రభుత్వం మంచి వాతావరణం కల్పించింది. ఉత్తమ ప్రమాణాలతో కూడిన చదువుతోపాటు మంచి పౌష్టికాహారం అందిస్తోంది. ఏ ప్రభుత్వం చేపట్టలేని విధంగా పాఠశాలలను అభివృద్ధి చేసింది. విద్యార్థులు ఆడునేందుకు వీలుగా క్రీడా మైదానాలను అందుబాటులోకి వచ్చింది.

– ప్రసాద్, విద్యార్థి తండ్రి, రంపచోడవరం



రామచంద్రపురంలో పేదలకు దుస్తుల పంపిణీ

హుకుంపేట: మండలంలోని భీమవరం పంచాయతీ రామచంద్రపురంలో గిరిజాగృతి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఝాన్సీ లక్ష్మిబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మిబాయి చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. పేద గిరిజనులకు చీరలు పంపిణీ చేశారు. గిరిజాగృతీ అసోసియేషన్ అధ్యక్షుడు మోరి సింహాచలం మాట్లాడుతూ ఝాన్సీ లక్ష్మిబాయి జీవితం ప్రతీ ఒక్కరికి ఆదర్శమన్నారు.

పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. సంస్థ తరపున ఏజెన్సీలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. గిరిజాగృతి ప్రతినిధులు శ్యామ్‌సుందర్, నూకరాజు, ప్రేమ్‌కుమార్,చందు, భూషణం పాల్గోన్నారు.



రామచంద్రపురంలో చీరలు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

పూజా సామగ్రి అందజేత

అడ్డతీగల: మండలంలోని వీరవరంలో త్వరలో కనకదుర్గమ్మ విగ్రహం ప్రతిష్ఠించనున్న నేపథ్యంలో ఆ కార్యక్రమం విజయవంతంగా జరగాలని ఆకాంక్షిస్తూ పవనగిరి క్షేత్రం ద్వారా వస్త్రాలు, పూజా ద్రవ్యాలను అందజేశారు. ఆ గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు పవనగిరి క్షేత్రం ద్వారా కనకదుర్గమ్మ విగ్రహాన్ని ఉచితంగా అందజేయనున్నట్టు పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య, సతీమణి విజయలక్ష్మి చెప్పారు. ఈ మేరకు ఆదివారం పవనగిరి క్షేత్రానికి వచ్చిన వీరవరం గ్రామస్తులకు పసుపు, కుంకుమ, పూజాద్రవ్యాలు సంప్రదాయం ప్రకారం అందజేశామన్నారు.



వీరవరం గ్రామస్తులకు వస్త్రాలు, పూజా సామగ్రి అందజేస్తున్న తణుకు విజయలక్ష్మి

విద్యార్థులకు ఆటల, పాటల పోటీలు



పాటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సర్పంచ్ అక్కమ్మ

దుంబ్రిగుడ: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయ అధికారిణి శెట్టి సునీత ఆధ్వర్యంలో పిల్లలకు మ్యూజికల్ చైర్స్ ఆటలను నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మట్లాడుతూ ఈ వారోత్సవాల్లో భాగంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు.

గంగవరం : స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా మహిళా దినోత్సవం, దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రంథాలయాధికారి గంగాభవానీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సర్పంచ్, లైబ్రరీ భవన స్థలదాత కలుముల అక్కమ్మ ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళిలర్పంచారు.. మహిళలకు, బాలికలకు వివిధ పోటీలను నిర్వహించారు. డ్వాక్రా మహిళలు వెంకటలక్ష్మి, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు. గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా నిర్వహించి వివిధ పోటీల్లో విజేతలకు సోమవారం ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందిస్తామని గ్రంథాలయాధికారి గంగాభవానీ తెలిపారు.

రేపు మండల సమావేశం

వీఆర్ పురం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఫణీంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కారం లక్ష్మీ అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి మండల స్థాయి అధికారులు, సిబ్బంది తగిన సమాచారంతో హాజరు కావాలన్నారు.

22న మండల సమావేశం

కొయ్యూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బడుగు రమేష్ ఆధ్వర్యంలో ఈనెల 22న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో లాలం సీతయ్య చెప్పారు. దీనికి అన్ని శాఖల అధికారులు విధిగా సంబంధిత సమాచారంతో హాజరుకావాలని సూచించారు. సమావేశానికి అధికారులు తమకు బదులుగా సిబ్బందిని పంపవద్దన్నారు.

అనారోగ్యంతో చిన్నారి మృతి



చిన్నారి మృతదేహం

జి.మాడుగుల: బొయితిలి పంచాయతీ మండిభ గ్రామానికి చెందిన మినుముల వెంకటరావు, సుజాత దంపతులకు చెందిన రెండు సంవత్సరాలు 11నెలల వయస్సు గల కుమార్తె ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. గత కొన్నాళ్లుగా వెన్నుముక, ఇతర ఆనారోగ్య కారణాలతో బాధపడుతుండటంతో విశాఖపట్నం కెజీహెచ్‌లో కొన్నాళ్లు పాటు వైద్యం అందించినట్టు చిన్నారి తల్లిదండ్రులు తెలిపారు. వారం రోజుల క్రితం కెజీహెచ్ నుంచి స్వగ్రామం మండిభకు తీసుకొచ్చామని, ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి మృతి చెందినట్టు వారు చెప్పారు.

బస్సు యాత్రను విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హుకుంపేట: మండల కేంద్రంలో ఈనెల 30న చేపట్టనున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ నాయకురాలు, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు కొర్ర కాసులమ్మ తెలిపారు. కొంతిలి లో కాసులమ్మ, సర్పంచ్ రేగం రమేష్‌ల ఆధ్వర్యంలో నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చేపడుతున్న సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం చేయాలని కోరారు. నాయకులు చిన్నారావు, సర్పంచ్‌లు పోతురాజు, అశోక్, అరుకు ఎంఈవో త్రినాథ్, మాజీ ఎంపీటీసీ భాస్కరరావు, నాయకులు సువాసు, వినోద్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రకృతి హారతి



ప్రకృతి హారతి నిర్వహిస్తున్న తణుకు వెంకటరామయ్య తదితరులు

అడ్డతీగల: మన్యంలో సత్యదీక్షల మాలధారణకు వేదికగా నిలుస్తున్న అడ్డతీగలలోని పవనగిరి క్షేత్రంలో ఆదివారం ప్రకృతి హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు.పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏజెన్సీలోని పలు ప్రాంతాలకు చెందిన సత్య దీక్ష మాలధారులు హాజరయ్యారు. మానవ జీవితానికి ప్రకృతితో ముడిపడి ఉన్న బంధానికి విలువనిస్తూ మరోసారి ఈ అంశాన్ని మననం చేసుకుంటూ ప్రకృతి హారతి కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తణుకు వెంకటరామయ్య అన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



మండల పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం

అనంతగిరి: మండలంలోని కాశీపట్నంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి అప్పలరాజు ఆధ్వర్యంలోని నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడు రామకృష్ణ, అధ్యక్షుడు మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శులుగా సింహాచలం, ప్రియదర్శిణి, రోజాను ఎన్నుకున్నారు. అనంతరం వన భోజనాల కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు మోహన్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. ఉపాధ్యాయులు సురేష్, త్రినాథ్, వెంకటరావు, చిట్టిబాబు, స్వామినాయుడు, బాలరాజు, శివ, దేముడు, సంతోష్, బుల్లి, సతీష్ పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి సర్వే

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీలో బాలరేవుల నుంచి తిమురాయి, బాలరేవుల నుంచి నూకరయితోట గ్రామాల మధ్య రహదారుల నిర్మాణానికి అటవీశాఖ సిబ్బంది ఆదివారం సర్వే నిర్వహించారు. కొయ్యూరు అటవీ సెక్షన్ అధికారి సింహాద్రి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో రహదారి నిర్మాణానికి గాను ఎంత మేర అటవీ భూములు వినియోగించాల్సి ఉంటుందన్న విషయాన్ని పరిశీలించారు. ఈ సర్వే నివేదికను అటవీ శాఖ ఉన్నతాధికారులకు అందజేయనున్నారు. ఎం.మాకవరం ఇంజనీరింగ్ సహాయకుడు పవన్ తదితరులు పాల్గొన్నారు.